సాక్షి ఒడిశా

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024

I



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,82,810లు, బంగారం 1 గ్రాము ,వెండి 16 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఒక్క అవకాశం ఇవ్వండి

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కోరారు.

- IIలో



మరోసారి గెలిపించండి

రాష్ట్రంలో బీజేడీకి మరో అవకాశం ఇవ్వాలని 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ కోరారు.

- IIలో

న్యూస్‌రీల్

36 చోట్ల సీఎం నవీన్ ప్రచారం



నవీన్ పట్నాయక్ ప్రచార రథం


భువనేశ్వర్: బిజూ జనతా దళ్ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన సొంత నియోజకవర్గం హింజిలి నుంచి బుధవారం ఎన్నికల ప్రచారానికి దిగారు. మే 29 వరకు వివిధ విడతల్లో బీజేడీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 36 చోట్ల ఆయన ప్రచారం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ నియోజకవర్గాలు, 147 అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ బీజేడీ అభ్యర్థుల కోసం నవీన్ పట్నాయక్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా 5టీ చైర్మన్ కార్తీక్ పాండియన్ రాష్ట్రవ్యాప్తంగా 102 చోట్ల ఎన్నికల ర్యాలీలు నిర్వహించనున్నారు. సంప్రదాయ ప్రచార విధానానికి స్వస్తి పలికి పూర్తిగా ఏసీ హైటెక్ బస్సులో ఈసారి ప్రచారం కొనసాగిస్తారు. ప్రస్తుతం వేడిమి వాతావరణాన్ని ధీటుగా ఎదుర్కొగలిగే స్థాయిలో 16 టన్నుల ఏసీ, హైడ్రాలిక్ లిఫ్ట్, పడక, సౌకర్యవంతమైన సోఫా, ఆడియో–విజువల్ సెట్ ఆధునిక సౌకర్యాల వాష్‌రూమ్‌తో సమావేశం హాలు సౌకర్యాలు ఈ బస్సులో ఉన్నాయి. ఇంటర్నెట్, శాటిలైట్ టీవీతో కూడిన ఇది విలాసవంతమైన హోటల్ గదిని పోలి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా వేడిమి స్థాయి పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రికి వేడి నుంచి రక్షణ కల్పించేందుకు బుల్లెట్ ప్రూఫ్ బస్సులో సన్ రూఫ్ ద్వారా పైకి వచ్చి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు అనుకూల సౌకర్యాలు కల్పించారు. ఒడిశాలో మే 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనుండగా జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

దిగొపాహండి కాంగ్రెస్ అభ్యర్థి మార్పు

భువనేశ్వర్: గంజాం జిల్లా దిగొపాహండి అసెంబ్లీ స్థానంలో అభ్యర్థిని మార్చినట్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ తెలిపింది. ఈ స్థానం నుంచి సాకా సుజిత్ కుమార్‌ను అభ్యర్థిగా తాజా ప్రకటన విడుదల చేసింది. ఇంతకుముందు ఈ నియోజకవర్గం నుంచి శ్రీధర్ దేవ్‌ను అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) దిగపాహండి నుంచి తన అభ్యర్థిగా దివంగత నేత సూర్య నారాయణ్ పాత్రో కుమారుడు బిప్లబ్ పాత్రోను పోటీకి నిలబెట్టింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఒడియా సినీ నటుడు సిద్దాంత్ మహాపాత్రోకు ఈ స్థానం నుంచి ఖరారు చేసింది. గతంలో ఒడిశాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను మార్చడం గమనార్హం. భారత మాజీ హాకీ కెప్టెన్ ప్రబోధ్ టిర్కీని తాలొసారా నియోజకవర్గానికి నామినీగా తొలగించింది. తన స్థానంలో దేబేంద్ర బిటారియాను కొత్త అభ్యర్థిగా ప్రకటించింది. అలాగే మరో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను మార్చింది. బలిగుడ అసెంబ్లీ స్థానంలో సురదా ప్రధాన్ స్థానంలో ఉపేంద్ర ప్రధాన్, కబిసూర్యనగర్ నియోజకవర్గంలో చిరంజీబ్ బిసోయ్ స్థానంలో బిపిన్ బిహారీ స్వంయిని కొత్త అభ్యర్థులుగా ప్రకటించింది.

తండ్రి బదులుగా కూతురు..?

- మొకీం స్థానంలో కుమార్తె సోఫియా పోటీచేసే అవకాశం



సోఫియా ఫిర్దాస్

భువనేశ్వర్: రాష్ట్రంలో కటక్ – బారాబటి శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్‌కు అత్యంత కీలకం. ఈ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీం రుణ కుంభకోణం కేసులో చిక్కుకున్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీపై అవకాశాలు సన్నగిల్లినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ పరిస్థితులను సమయస్ఫూర్తితో సానుకూలంగా మలిచే దిశలో మొకీం పావులు కదుపుతున్నారు. ఆయన బదులుగా కూతురుని బరిలోకి దింపితే వివాదరహితంగా సమస్య పరిష్కారం అవుతుందని యోచిస్తున్నారు. ఈ దిశలో నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన అనుచరులు ఇతరేతర సన్నిహిత వర్గాలతో సంప్రదింపులు చకచకా నిర్వహిస్తున్నారు. ప్రాథమిక దశలో ఈ సంప్రదింపులు ఆయన యోచనకు మద్దతు పలకడం విశేషం. ఈ నేపథ్యంలో తన కుమార్తె సోఫియా ఫిర్దాస్ ఎన్నికల బరిలో దిగవచ్చనే సంకేతాలు బలపడుతున్నాయి. కాంగ్రెసు అధిష్టానంతో సంప్రదింపులకు సన్నాహాలు చేస్తున్నారు. ఇంతవరకు కటక్ – బారాబటి నియోజకవర్గానికి అఖిల భారత కాంగ్రెసు కమిటీ అభ్యర్థిని ఖరారు చేయలేదు. తండ్రి బదులుగా కూతురుని బరిలోకి దింపి కటక్ – బారాబటి స్థానం చేజార్చుకోకుండా జాగ్రత్త వహించేందుకు కాంగ్రెసు అధిష్టానం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నారు. మరోమారు నియోజకవర్గంలో మేధావులు, ప్రజలతో చర్చించి ఏఐసీసీకి ప్రతిపాదన దాఖలు చేయనున్నట్లు తెలిపారు.



పర్లాకిమిడి: నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



పర్లాకిమిడి: నామినేషన్ దాఖలు చేస్తున్న ఆప్ అభ్యర్థి మనోజ్ బోదోనాయక్



జయపురం: కోట్‌పాడ్ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ అందజేస్తున్న రూపు బౌత్ర



మల్కన్‌గిరి: చిత్రకొండ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న డొంబురు సీసా

నామినేషన్లకు తెర..!

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. దీంతో చివరి రోజు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు వేసేందుకు బయల్దేరారు. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. నేటి నుంచి నామినేషన్ల పరిశీలన జరిగింది.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఆప్ అభ్యర్థి గౌరీచరణ్ దేవ్ శర్మ



మల్కన్‌గిరి: చిత్రకొండ ఆప్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న శరత్ బురద



బరంపురం: చికిటి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న చిన్మయనంద దేవ్



పర్లాకిమిడి: స్వతంత్ర అభ్యర్థి ప్రీతి లతా పట్నాయక్



పర్లాకిమిడి: నామినేషన్ దాఖలు చేసి వస్తున్న మోహన స్వతంత్ర అభ్యర్థి రూబెన్ మండల్



బరంపురం: భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న విక్రమ్ పండా




జయపురం: స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన ప్రితీష్ పట్నాయక్



జయపురం: నామినేషన్లు వేసేందుకు వెళ్తున్న జయపురం, కోట్‌పాడ్ బీజేపీ అభ్యర్థులు

టీస్టాల్ యజమాని దారుణ హత్య!



సంఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు

- వారం తరువాత బయటపడిన వైనం

జయపురం: స్థానిక పాత సబ్‌డివిజన్ ఆస్పత్రి ప్రాంతంలో కొన్నేళ్లుగా టీ స్టాల్ నడుపుతూ జీవిస్తున్న తంబి అయ్యర్ (56) దారుణహత్యకు గురయ్యారు. ఈ విషాద ఘటన వారం తరువాత వెలుగు చూసింది. అయ్యర్ గొంతు, శరీరంపై వివిధ భాగాల్లో పెద్ద గాయాలు ఉన్నాయి. దుండగులు హత్య చేసి మృతదేహాన్ని అతని ఇంట్లోనే ఉంచేసి బయట తాళాలు వేసి పరారైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. తంబి ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఊరు వెళ్లి ఉంటారని ఇరుగు పొరుగువారు భావించారు. అయితే మంగళవారం సాయంత్రం నుంచి ఇంటి నుంచి దుర్వాసన రావటంతో స్థానికులకు అనుమానం వచ్చి పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత్ కుమార్‌శర్మ, పట్టణ పోలీసు అధికారి రక్మీ రంజన్ దొలాయి నేతృత్వంలోని బృందం ఘటనా స్థలాన్ని సందర్శించారు. తలుపులు తెరచి లోపలికి వెళ్లి చూడగా తంబి అయ్యర్ శవమై కనిపించారు. దీంతో క్లూస్ బృందాన్ని రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. అయ్యర్ మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు వారం రోజుల క్రితం హత్యకు గురై ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. హత్య చేసిన దుండగులు మృతదేహంపై గొంగలి కప్పేసి ఉంచడాన్ని పోలీసులు గుర్తించారు. ఘటనా ప్రాంతంలోని పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. హత్యకు పాల్పడింది ఎవరు, కారణాలు త్వరలోనే వెల్లడవుతాయని సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత్ కుమార్‌శర్మ తెలిపారు. హత్యకు గురైన తంబి అయ్యర్ తమిళనాడు నుంచి 40 ఏళ్ల కిందట బతుకు తెరువు కోసం జయపురం వచ్చి టీ దుకాణం పెట్టుకొని వచ్చే ఆదాయంతో ఒంటరిగానే జీవిస్తున్నారని స్థానికులు తెలిపారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



ప్రమాదానికి గురైన భోగీలు

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వేమార్గంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ప్రమాదం జరిగింది. గురువారం కొరాపుట్ జిల్లా పాడువ రైల్వేస్టేషన్ వద్ద భోగిలు ఒకవైపునకు ఒరిగిపోయాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిరండోల్ నుంచి ముడి ఇనుప రజనుతో గూడ్స్ రైలు విశాఖపట్నం వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. వెంటనే అధికారులు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. కొరాపుట్, జగదల్‌పూర్ ప్రాంతాల నుంచి విశాఖ వైపు రాకపోకలు చేసే అనేక రైళ్లు పలు స్టేషన్ల వద్ద నిలిచిపోయాయి. వాల్తేర్ డివిజన్ నుంచి పునరుద్ధరణ విభాగాలు వచ్చి పనులు ప్రారంభిచాయి.

దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు



అరెస్టయిన దొంగలతో పోలీసులు

- ఇద్దరు దొంగలు అరెస్టు
- చోరీ సొత్తు స్వాధీనం

బరంపురం: బరంపురం జిల్లా ఓం విహార్‌లో ఈ నెల 19వ తేదీన జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 42 గ్రాముల బంగారం చైన్, ఒక కిలో 49 గ్రాముల వెండి సామగ్రి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, ఐరన్ రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి బసంత్ కుమార్ సెఠి గురువారం అందించిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి గుసానినువాగాం పోలీసుస్టేషన్ పరిధిలోని ఓం విహార్ తొమ్మిదో లైన్‌లో నివాసం ఉంటున్న గీతంజలి రౌత్ ఇంటి ఐరన్ గేటును దొంగలు పగలగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువా తలుపులను పగలగొట్టి బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని దోచుకొని పరారయ్యారు. చోరీ జరిగిన విషయాన్ని గమనించిన గీతంజలి రౌత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో బరంపురం జిల్లా దిగపండికి చెందిన కె.నువాగాం, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టికి చెందిన క్రిష్ణ రెడ్డిగా గుర్తించినట్టు ఐఐసీ బసంత్ సెఠి తెలిపారు.



స్వాధీనం చేసుకున్న సొత్తు, ద్విచక్ర వాహనం



రానున్న 5 రోజులు వడగాల్పులు

- 10 జిల్లాలకు హెచ్చరికలు జారీ

భువనేశ్వర్ : రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. మరో 5 రోజుల పాటు రాష్ట్రంలో భరించలేని వేడి గాలులు వీస్తాయని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. 5 రోజుల పాటు 10 జిల్లాలకు తీవ్రమైన వడగాడ్పుల హెచ్చరిక జారీ చేసింది. 7 జిల్లాల్లో 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈనెల 27, 28 తేదీల్లో భరించలేని వేడిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరో 5 రోజుల్లో రాష్ట్రంలో పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారనుంది. ఈనెల 27, 28 నాటికి సుందర్‌గఢ్, కలహండి, బాలేశ్వర్, మయూర్‌భంజ్, బౌధ్, ఖుర్దా, జగత్‌సింగ్‌పూర్, సుబర్ణపూర్, నువాపడా, కెంఝొహర్ తదితర 10 జిల్లాల్లో తీవ్రమైన వేడిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది. అదేవిధంగా ఝార్సుగుడ, సంబల్‌పూర్, కలహండి, నువాపడా, గజపతి, అంగుల్, మయూర్‌భంజ్ వంటి 7 జిల్లాల్లో 45 డిగ్రీల సెల్సియస్ కంటే అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని భువనేశ్వర్ వాతావరణ విభాగం అంచనా వేసింది.

శాంతి, సంక్షేమానికి పట్టం కట్టండి

- జయపురం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం:

సమాజంలో శాంతి, ప్రజలలో మైత్రి, ప్రగతిని పరిరక్షించడంతోపాటు అభివృద్ధికి కృషి చేసే నాయకులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలని జయపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి ప్రజలకు పిలుపు నిచ్చారు. జయపురం సమితి జయంతిగిరి పరిధి హటపాదర్‌లో గురువారం నిర్వహించిన మిశ్రణపర్వ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన వందలాది మంది కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ.. గత పదేళ్లలో నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి చేసిన కృషిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కొత్తగా పార్టీలో చేరిన వారు పార్టీ విజయానికి సమిష్టిగా పనిచేయాలన్నారు. పార్లమెంట్‌లో సప్తగిరి ఉల్క, విధానసభలో తాను ప్రజల సమస్యలపై పోరాటం సాగిస్తామని.. చేతి గుర్తుపై ఓటు వేసి ఇద్దరిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు దేవేంద్రబాహిణీపతి, జిల్లా యూత్‌కాంగ్రెస్ నాయకుడు సందీప్ సామంతరాయ్, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయక్, బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, నాయకులు ఎ.సి. రావు, కె.సుధాకరరావు, టున బాహిణీపతి పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న తారాప్రసాద్ బాహిణీపతి తదితరులు



తారాప్రసాద్ బాహిణీపతికి స్వాగతం పలుకుతున్న యువకులు



కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన యువకులు

క్లుప్తంగా

వైభవంగా రాముడి పట్టాభిషేకం



పట్టాభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

భువనేశ్వర్: శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని ఖుర్దా రోడ్ ట్రాఫిక్ కాలనీ రామ మందిరంలో గురువారం శ్రీరాముడి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. స్థానిక అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలస నిమజ్జనం, ధ్వజారోహణంతో ఈ ఏడాది శ్రీ రామ నవమి ఉత్సవాలను ముగించారు.

గజపతి జిల్లా ఎన్నికల పర్యవేక్షకులుగా గంధం చంద్రుడు



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు గంధం చంద్రుడు

పర్లాకిమిడి: గజపతి జిల్లాకు ఎన్నికల ముఖ్య పర్యవేక్షకులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గంధం చంద్రుడు నియామకం అయ్యారు. కలెక్టరేట్‌లో కేటాయించిన కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. బరంపురం పార్లమెంటరీ స్థానానికి ఎన్నికల అధికారిగా నియమితులైన మోహానా, పర్లాకిమిడి పర్యవేక్షకులు చంద్రుడు ఎన్నికల సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి స్మృతి రంజన్ ప్రధాన్, జిల్లా ఎస్పీ స్వాతి యస్.కుమార్ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం




ప్రసంగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కోరారు. రాష్ట్రంలో పశ్చిమ ఒడిశా సోన్‌పూర్ నుంచి పార్టీ తరఫున ప్రచారానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బీజేపీ స్థానికంగా ప్రజలకు ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాహిత పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. దీనికి ఆయుష్మాన్ యోజన ఒక నిలువెత్తు ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రంలో దీనిని అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదరణ తగ్గి, పీఎం నరేంద్రమోదీకి పెరుగుతుందని నవీన్ ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు. ఒడిశా భాష, సంస్కృతిని మెరుగుపరిచేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. బీజేపీ కేవలం 5 ఏళ్లలో ఒడిశాను దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా మార్చగలుగుతుందన్నారు. రాష్ట్రంలో 20 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో పేదలు

ఒడిశా ఖనిజ నిక్షేపాలు ఇతర సహజ వనరులతో ఉన్న రాష్ట్రం అయినప్పటికీ అత్యధిక సంఖ్యలో పేదలు ఉన్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధికి, పేదలకు భరోసా కల్పిస్తామని వెల్లడించారు. పని వెతుక్కుంటూ ఎవరూ ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేస్తున్నారని బీజేడీ సర్కారుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే పూరీలోని జగన్నాథ ఆలయాన్ని కాశీ విశ్వనాథ ఆలయంలా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అంతకుముందు సభను ఉద్దేశించి సంబల్‌పూర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ గత 24 ఏళ్లలో హింజిలి, బిజేపూర్, కంటాబంజీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం ప్రచురించాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు సవాలు విసిరారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా, బొలంగీర్ పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థి సంగీతా కుమారి సింగ్ దేవ్, సోన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రమోద్ మహాపాత్రో, బీరమహరాజపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘునాథ జగదొలా, లొయిసింగ ఎమ్మెల్యే అభ్యర్థి ముకేష్ మహాలింగ్, రెంగాలి ఎమ్మెల్యే అభ్యర్థి నవురి నాయక్, విపక్ష నేత జయ నారాయణ మిశ్రా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, కనక వర్ధన్ సింగ్‌దేవ్, గోలక్ మహాపాత్రో తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



అమిత్ షా బహిరంగ సభకు హాజరైన జనం

నవ ఒడిశా నిర్మాణ సారథి నవీన్ పట్నాయక్

- బిసంకటక్, గుణుపూర్ ఎన్నికల ప్రచారంలో 5-టీ అధ్యక్షుడు వి.కె.పాండ్యన్

రాయగడ: నవ ఒడిశా నిర్మాణ సారథి నవీన్ పట్నాయక్ అని 5-టీ అధ్యక్షుడు వి.కె.పాండ్యన్ అన్నారు. రాయగడ జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా బిసంకటక్‌లోని ఇన్‌డోర్ స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడారు. ఈ సభలో నియోజకవర్గం నుంచి మూడోసారి బీజేడీ తరఫున పోటీ చేస్తున్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక, కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి కౌసల్య హికకలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండ్యన్ మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సాధించలేని ప్రగతిని కేవలం బీజేడీ రెండు దశాబ్దాల పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించగలిగినట్టు చెప్పారు. అటువంటి ప్రభుత్వానికి మీరంతా అండగా ఉంటే మరో ఐదేళ్ల బీజేడీ పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో నవీన్ పట్నాయక్ సారథ్యానికి మరో అవకాశం కల్పించాలని పాండ్యన్ కోరారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

మహిళల ఆర్థిక వికాసానికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని పాండ్యన్ అన్నారు. మరోసారి ఎన్నికల్లో విజయాన్ని అందిస్తే సంక్షేమ పథకాలను అమలు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోందని అన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధమయ్యాయని పాండ్యన్ వివరించారు.

ఇది ప్రజల పాలన

నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బీజేడీ సర్కార్ ప్రజల పాలనగా పాండ్యన్ వివరించారు. రాష్ట్ర ప్రజలకు సుస్థిరమైన పాలనను అందించే సత్తా కేవలం బీజేడీకి మాత్రమే ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో ప్రభుత్వం ఎట్టిపరిస్థితిలో తప్పటడుగు వేయడం లేదన్నారు. అందువల్లే ప్రజలు అంతగా ఆరాధిస్తున్నారని పాండ్యన్ వ్యాఖ్యానించారు. బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో డొంగిరియా తెగలకు చెందిన ఆదివాసీలు నివసిస్తున్నారని.. వారి ఆర్థిక వికాసానికి సంక్షేమ పథకాలను అమలు చేసి వారిని ప్రగతి దిశగా పయనించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య, ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

ఆ పార్టీలను నమ్మకండి

మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించే పార్టీలను నమ్మవద్దని పాండ్యన్ కోరారు. ప్రజల బాగోగులు చూసే పార్టీకే మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ప్రగతి దిశగా పయనిస్తున్న బీజేడీ సర్కార్‌కు మరోసారి పట్టం గట్టాలని కోరారు. మరోసారి నవీన్ పట్నాయక్ సారథ్యానికి అండగా నిలిచి ఆశీర్వదించాలన్నారు. అంతకుముందు హెలికాప్టర్‌లో వచ్చిన పాండ్యన్ సరాసరి ప్రజల వద్దకు వెళ్లి వారి అభినందనలు, ఆశీర్వాదాలు స్వీకరించారు.

గుణుపూర్‌లో..

బిసంకటక్ సభ అనంతరం పాండ్యన్ గుణుపూర్ వెళ్లారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, ఆ పార్టీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి సుదీర్ దాస్, ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్ గొమాంగోలు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో పాండ్యన్ ప్రసంగించి బీజేడీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ప్రజలకు కరచాలనం చేస్తున్న పాండ్యన్



బిసంకటక్ సభలో ప్రసంగిస్తున్న పాండ్యన్, పక్కనే కౌసల్య, జగన్నాథ సరక



బిసంకటక్ సభకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు



గుణుపూర్‌లో పాండ్యన్‌కు స్వాగతం పలుకుతున్న నెక్కంటి, సుధీర్ గొమాంగో

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

- 120 మంది అగ్నిమాపక సురక్షా సిబ్బంది నియామకం

బరంపురం:

లంజిపల్లి 42వ వార్డు గొయిలండి ప్రాంగణంలో బరంపురం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం మాక్ డ్రిల్ చేపట్టారు. ఏ విధంగా రక్షణ పొందుతూ ప్రమాదం నుంచి తప్పించుకోవాలో, ప్రమాదంలో ఉన్నవారిని ఏవిధంగా రక్షించాలో స్థానికులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, బీజేడీ జిల్లా కార్యదర్శి సురేంద్ర మహరణ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అటవీశాఖ శాటిలైట్ ద్వారా జిల్లాలోని వివిధ అటవీ ప్రాంతాలోని కార్చిచ్చు, అగ్నికి దగ్ధమవుతున్న అటవీ ప్రాంతాలు సుమారు 735గా గుర్తించినట్టు ఏసీఎఫ్ అశోక్ కుమార్ సాహు గురువారం తెలియజేశారు. ఇందులో 601 అటవీ కార్చిచ్చుల్లో 134 సంఘటనలు అటవీ పరిధిలో లేనివిగా గుర్తించామన్నారు. ఇప్పటి వరకు అటవీ ప్రాంతంలో 120 మంది అటవీ అగ్ని సురక్షా సిబ్బందిని నియమించి, 134 కార్చిచ్చు సంఘటనలు ఆర్పివేశామన్నారు. జిల్లాలో వివిధ అటవీ ప్రాంతాల్లో రోజుకు 15 నుంచి 20 అటవీ పాయింట్లలో కార్చిచ్చు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అటవీ ప్రాంతంలో కార్చిచ్చు ఆపడానికి ఒక కంట్రోల్ రూమ్‌ను డీఎఫ్ఓ.కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా అటవీ ప్రాంతంలో కార్చిచ్చు సంఘటన జరిగితే ఫోన్ 93484 05360కు సమాచారం అందించాలని డీఎఫ్ఓ ఆనంద్ అన్నారు. అటవీ ప్రాంతంలో కార్చిచ్చు ఆపడానికి ఓడ్రాఫ్ టీమ్ 42 మందితో ఏర్పాటుచేసినట్లు తెలిపారు.



జిల్లాలో అడవులు తగలబడిపోవడంతో మంటలను ఆపుతున్న సురక్షా సిబ్బంది



బిద్దువ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంటలను ఆపుతున్న అటవీ సురక్షా సిబ్బంది



అటవీ ప్రాంతంలో కార్చిచ్చు ఆపడానికి నియమించిన ఓడ్రాఫ్ టీమ్

మరోసారి గెలిపించండి



పొట్టంగి బీజేడీ అభ్యర్థి ప్రఫుల్ల పంగి, ఎమ్మెల్యే పీతం పాడీలతో పాండ్యన్ పక్కనే కొరాపుట్ ఎంపీ అభ్యర్థి కౌసల్య హిక్కా



దశమంత్‌పూర్‌లో అభ్యర్థులతో అభివాదం చేస్తున్న పాండ్యన్

కొరాపుట్: ప్రజా సమస్యలు పరిష్కరించామని 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ గుర్తు చేశారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి అసెంబ్లీ పరిధిలోని బంగ్రగుడ, లక్ష్మీపూర్ అసెంబ్లీ నియెజకవర్గం దశమంతపూర్‌లో గురువారం జరిగిన ప్రచార సభల్లో ప్రసంగించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశంతో తాను గత రెండేళ్లుగా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలు విన్నానన్నారు. అందులో అత్యధిక సమస్యలు పరిష్కారయ్యాయన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆరోసారి విజయం సాధించడానికి ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కానీ అనేక సమస్యలు నవీన్ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు భారీ ఎత్తున నిధులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో కొరాపుట్ ఎంపీ అభ్యర్థి కౌసల్య హిక్కా, ఎమ్మెల్యే అభ్యర్థులు రఘురాం పాడాల్ (కొరాపుట్), ప్రపుల్ల పంగి (పొట్టంగి), ప్రభుజాని(లక్ష్మీపూర్)ను ప్రజలకు పరిచయం చేశారు.



సభకు హాజరైన ప్రజలు

ట్రాక్టర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పంచాయతీ సీతమ్మపేట వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియెట్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేటకు చెందిన శిదపాన యర్రన్న, నర్సమ్మల పెద్దకుమారుడు శ్రీనివాసరావు(17) బైక్‌పై కోటబొమ్మాళిలోని బజారుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా సీతన్నపేట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావు కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాడు. ఇంతలో ఆకస్మిక మృతి చెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ లక్ష్మణరావు తెలిపారు.

కుంకుమార్చనలు

జయపురం:

స్థానిక జమాల్‌లూన్‌లో గల శ్రీరామ మందిరంలో నవరాత్రుల సందర్భంగా కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం గురువారం నిర్వహించారు. సీతాదేవికి లలితా సహస్ర నామాలతో కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారి ఉలిమిరి నాగేశ్వరరావు, పురోహితులు గన్నవరపు వెంకటరమణ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లలితా సహస్ర నామాలు పఠించిన మహిళలను సన్మానించారు. ఆలయ పూజారి ఉలిమిరి నాగేశ్వరరావు మనవరాలు శ్రీకృతి శాస్త్రీయ నృత్యంతో భక్తులను అలరించింది. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ జి.నాగరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీరామ మందిరంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



మహిళలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు



శ్రీకృతిని అభినందిస్తున్న మహిళలు



పూజలు అందుకున్న సీతారాములు

అమలుకాని ఎన్నికల నిబంధనలు

- ఎక్కడికక్కడ దర్శనమిస్తున్న వివిధ పార్టీల హోర్డింగ్‌లు
- పట్టించుకోని అధికారులు



గాంధీ జంక్షన్ వద్ద బీజేడీ హోర్డింగ్



కాంగ్రెస్ పార్టీ తొమ్మిది హామీలతో ఉన్న హోర్డింగ్

జయపురం: ఎన్నికల నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెంటనే పట్టణాలు, గ్రామాల్లో ఉన్న వివిధ పార్టీల హోర్డింగ్‌లు, కటౌట్లు, పోస్టర్లను అధికారులు నామమాత్రంగా తొలగించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఇప్పటికీ కొన్ని పార్టీల హోర్డింగ్‌లు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జయపురం పట్టణ ప్రధాన కూడలి గాంధీ జంక్షన్ వద్ద 26వ జాతీయ రహదారి, 326 విజయవాడ-రాంచీ జాతీయ కారిడార్ కూడలి వద్ద ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, జయపురం బీజేడీ అభ్యర్థి ఇందిరా నందో ఫొటోలు, పార్టీ గుర్తులతో హోర్డింగ్ కట్టి ఉంది. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన తొమ్మిది హామీలతో కూడిన హోర్డింగ్ కూడా దర్శనమిస్తోంది. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రధాన పార్టీల హోర్డింగ్‌లను అధికారులు ఎందుకు తొలగించలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సువర్ణ మజ్జికి ఘన నివాళులు



అంత్యక్రియల్లో మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి, మాజీ ఎంపీ భగవాన్ మజ్జి



అంత్యక్రియలకు హాజరైన నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మజ్జి, ఎమ్మెల్యేలు ప్రకాష్ మజ్జి, మనోహర్ రంధారి

కొరాపుట్: రాష్ట్ర స్వతంత్ర మండలి సలహాదారుడు, మాజీ ఎంపీ ప్రదిప్ మజ్జి తల్లి సువర్ణ మజ్జి అంత్యక్రియలకు అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలు హాజయ్యారు. ప్రదిప్ స్వస్థలం జొరిగాంలో తల్లి అంత్యక్రియలు గురువారం జరిగాయి. ప్రదిప్ తండ్రి మాజీ రాజ్యసభ సభ్యుడు భగవాన్ మజ్జిని పలువురు పరమార్శించారు. ప్రదిప్ ప్రస్తుతం నబరంగ్‌పూర్ లోక్ సభ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అంతిమ యాత్రలో పార్టీలకు అతీతంగా నాయకులు హాజరయ్యారు. నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, నబరంగ్‌పూర్ ఎస్‌డీసీ అధ్యక్షుడు సన్‌రాజ్ గొండొ, కొరాపుట్ జిల్లా ఎస్‌డీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మజ్జి, బీజేపీకి చెందిన మాజీ ఎంపీ పరశురాం మజ్జి, కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థి భుజబల్ మజ్జి, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



లక్ష్మీ ధన్వంతరి హోమం

ఖుర్దా రోడ్ అకౌంట్స్ కాలనీ కొండపై ఉన్న బాలాజీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శనివారంతో ఉత్సవాలు ముగుస్తాయి. నిత్య సేవలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వంచారు. దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన కుంకుమ అర్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్వంతరి సహిత మహాలక్ష్మి హోమం నిర్వహించారు.

భువనేశ్వర్

క్లుప్తంగా

28, 30 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక

విజయనగరం రూరల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న (ఆదివారం) సీనియర్స్ విభాగంలో పురుషుల క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి ఒరిజనల్ ఆధార్, జన్మదిన ధ్రువ పత్రాలు తీసుకొని హాజరు కావాలన్నారు.

30న అండర్ –19 ఎంపిక పోటీలు

ఈ నెల 30న అండర్ –19 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రం, గత మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. సంబంధిత తేదీల్లో ఉదయం 6.30 గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్ తో హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యేపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన మహిళపై ఫిర్యాదు

దత్తిరాజేరు: బొండపల్లిలో ఈ నెల 23న టీడీపీ నిర్వహించిన మహిళా గళం సదస్సులో స్థానిక ఎమ్మెల్యేపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన మేడిశెట్టి సుబ్బలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని పెదమానాపురం పోలీస్‌స్టేషన్‌లో బోజరాజపురానికి చెందిన ఎస్.చెల్లయ్య, ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్‌లో ఎస్.చింతలవలస గ్రామానికి చెందిన వి.లక్ష్మణరావు గురువారం ఫిర్యాదు చేశారు. ఆ సదస్సులో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యపై నిరాధారమైన తప్పుడు వ్యాఖ్యలు చేసిన ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల్లో వారు కోరారు. ఎమ్మెల్యే ఆమె కుటుంబాన్ని వేధిస్తున్నారని, భూములు లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నారని చేసిన ఆరోపణలు నిరాధారమైనవని వారు పేర్కొన్నారు.

ఆలయ అర్చకుడు సస్పెన్షన్

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు రంపా సూర్యనారాయణశర్మను సస్పెండ్ చేశామని ఈఓ బీవీ మాధవరావు గురువారం తెలిపారు. ఆలయంలో అతని వద్దకు విద్యనభ్యసించడానికి వచ్చిన సహాయకుడైన భరద్వాజ్‌ని విచక్షణారహితంగా కొట్టడంపై వచ్చిన ఫిర్యాదులు మేరకు వారం రోజుల పాటు సస్పెండ్ చేశామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద మృతి


మృతి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ నాగరాజు

జామి: మండలంలోని అట్టాడ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కిర్ల గ్రామానికి చెందిన దండి నాగరాజు(34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నాగరాజు తన భార్య గౌరీతో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద నివాసం ఉంటున్నాడు. నాగరాజు తన భార్యను తిమిడి గ్రామానికి ఈ నెల 23న బంధువుల వివాహం కోసం పంపించాడు. తరువాత తన స్వగ్రామం కిర్ల గ్రామానికి వచ్చాడు. వచ్చిన నుంచి నాగరాజు విచారంగా ఉండేవాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు బైక్, ఫోన్, చెప్పులు ఇంటి వద్దే వదిలేసి బయటకు వెళ్లాడు. తరువాత తిరిగి రాలేదు. దీంతో నాగరాజు తండ్రి తన కుమారుడు కనబడలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం అలమండ హైవే వద్ద నాగరాజు మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని నాగరాజుగా గుర్తించారు. తండ్రి సన్యాసి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడు మృతదేహం

విజయనగరం టౌన్: స్థానిక కలెక్టరేట్ సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 70 నుంచి 75 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా అతని గురించి విచారణ చేశామని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వృద్ధుడి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

ప్రచారంలో దూకుడు

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల గడువు గురువారం పూర్తి కావడంతో అభ్యర్థులు ప్రచారంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా గురువారం నుంచి ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. ఓటరును ప్రత్యక్షంగా కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయాలని కోరుతున్నారు. తమ పాలనలో మంచి జరిగిందని భావిస్తేనే ఓటు వేయాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్


విజయనగరం: కణపాకలోని ఎన్నికల ప్రచారంలో కోలగట్ల వీరభద్రస్వామికి హారతిస్తున్న మహిళలు


నెల్లిమర్ల: గాంధీనగర్ కాలనీలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు


తెర్లాం: కొరటాంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు


కొత్తవలస: సబ్బవరం రోడ్డులో టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


రేగిడి: ఉప్పర్నాయుడువలస ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్


జామి: ఎం.కె.వలసలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు స్వాగతం పలుకుతున్న మహిళలు

పెళ్లింట విషాదం

దగ్గర బంధువు వివాహానికి అందరూ సంతోషంగా హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి క్రతువు పూర్తికావడంతో మధ్యాహ్నం భోజనాలు చేసి స్వగ్రామాలకు బయలుదేరారు. అంతే.. ఐదు నిమిషాల వ్యవధిలో వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ తొట్టి ఓ మలుపు వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో వధువు నాయనమ్మ మృతిచెందగా, మరో 15 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వై.వి.జనార్దన్

- ట్రాక్టర్ తొట్టి బోల్తా.. ఒకరు మృతి
- 15 మందికి గాయాలు
- పటువర్ధనం వద్ద ఘటన
- సహాయక చర్యలు అందించిన పటువర్ధనం, బాగంపేట వాసులు

వంగర: పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన ఓ యువతిని వంగర మండలంలోని పటువర్ధనం గ్రామానికి చెందిన యువకుడితో ఈ నెల 24న రాత్రి వివాహం జరిగింది. శుభకార్యంలో భాగంగా వివాహం మరుసటి రోజు గురువారం భోజనాలు పెట్టారు. దీని కోసం బంధువులందరూ ట్రాక్టర్‌పై వచ్చారు. వధూవరులను ఆశీర్వదించిన తర్వాత భోజనాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యారు. గ్రామం దాటిని ఐదు నిమిషాల్లోనే పటువర్ధనం–బాగెంపేట గ్రామాల మధ్య మలుపు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తొట్టి బోల్తా పడింది. అంతే.. ఆ ప్రాంతమంతా హాహాకారాలు మిన్నంటాయి. తొట్టిలో ప్రయాణిస్తున్నవారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. తొట్టి కింద ఉండిపోయిన వధువు నాయనమ్మ సత్తెమ్మ(50) ఘటనా స్థలంలోనే మృతిచెందింది. మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు బంధువులు చెబుతున్నారు. గాయపడిన వారిలో పడాల లక్ష్మి, యాకల నీలమ్మ, నంద నారాయణ, యాకల సన్యాసిరావు, పడాల సత్యం, ముగడ పైడమ్మ, నాగళ్ల పారమ్మ, నక్కాను గీత తదితరులు ఉన్నారు. వీరందరినీ 108 సహాయంతో రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుల వివరాలు సేకరించారు. ఎస్సై వై.వి.జనార్దన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులంతా పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని పెదపెంకి, చినగళావల్లి, వెంగాపురం, తెర్లాం మండలం నందబలగ, కాలరాజపురం, సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఘటనా స్థలానికి పెద్ద ఎత్తున పటువర్ధనం, బాగెంపేట గ్రామాలకు చెందిన ప్రజలు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వధువు తండ్రి సత్యం కూడా అదే ట్రాక్టర్‌లో ప్రయాణానికి సిద్ధమయ్యాడు. కొద్దిదూరం వెళ్లాక ఇంటి తాళంకోసం ట్రాక్టర్ దిగి ఊరిలోకి రావడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.


ఘటనా స్థలంలో మృతిచెందిన సత్తెమ్మ


రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రూ.4.43 కోట్ల విలువైన
నగదు, మద్యం, వస్తువుల సీజ్

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి


మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.4.43 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహ పరికరాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసిన అనంతరం గురువారం ఆమె కలెక్టరేట్ మీడియా సెంటర్‌లో మాట్లాడారు. సీజ్ చేసిన వాటిలో నగదు రూ.1.04 కోట్లు, 14,372 లీటర్ల మద్యం, రూ.29.75 లక్షల విలువైన డ్రగ్స్, రూ.1.85 కోట్ల విలువైన లోహ ఆభరణాలు, రూ.75.13 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు అధికారులతో జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సమావేశమై, సీజ్ చేసిన వాటిపై చర్చిస్తుందని తెలిపారు. వీటిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించినవైతే సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని చెప్పారు. సాధారణ ప్రజలకు చెందినవైతే వాటి ఆధారాలను పరిశీలించి విడుదల చేస్తారని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, సర్వైలెన్స్ టీమ్స్, చెక్ పోస్టుల్లో పోలీసులు సీజ్ చేసిన నగదు, వస్తువులకు సంబంధించి జెడ్పీ సీఈఓ ఆధ్వర్యంలోని గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని సూచించారు. జిల్లాకు ఎన్నికలు పరిశీలకులను నియమించామని, నేరుగా కలిసి ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. పోటీచేసే అభ్యర్థుల తుది జాబితాను 29వ తేదీ సాయంత్రం గుర్తులతో సహా ప్రకటించడం జరుగుతుందని వివరించారు. నామినేషన్ల స్క్రూటినీకి అభ్యర్థి, అతని ఎన్నికల ఏజెంటు, ప్రపోజర్‌తో పాటు మరొకరు, మొత్తం నలుగురిని మాత్రమే అనుమతిస్తామని చెప్పారు.

మే 21న పైడితల్లి దేవర మహోత్సవం

- కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు


దేవర మహోత్సవ విశేషాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు దేవర మహోత్సవం మే 21న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక అన్నదాన భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవ విశేషాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా వైశాఖ మాసంలో అమ్మవారి దేవర మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మే 20న సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి వనంగుడి వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహానికి స్నపన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అమ్మవారిని అలంకరణ చేసి, ఆలయం చుట్టూ మూడుసార్లు పూజారి ఉత్సవ విగ్రహంతో ప్రదక్షిణలు చేస్తారన్నారు. అక్కడ నుంచి అమ్మవారిని ఉత్సవ రథంపై ఆశీనులు చేసి వనంగుడి నుంచి సున్నంబట్టీ వీధి, గాడీఖానా, ఎన్‌సీఎస్‌రోడ్డు, కన్యకపరమేశ్వరీ ఆలయం, న్యూపూర్ణ కూడలి, పార్కు గేటు మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటి వద్ద ఉన్న చదురువద్దకు రాత్రి 7 గంటల ప్రాంతంలో తీసుకువెళ్తారు. అక్కడ రెండు తల్లి ఘటాలు, ఆరు పిల్ల ఘటాలకు భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఉపారాలు పెడతారన్నారు. అనంతరం శివాలయం వీధి మీదుగా అర్ధరాత్రి దాటిన తర్వాత చదురుగుడికి చేరుతారని తెలిపారు. వేకువజామున 3.30 గంటల ప్రాంతంలో పెద్దచెరువు పశ్చిమ భాగాన చెరువులో దిగి సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తలయారులు, జముకులు అమ్మవారికి మనవి చెప్పి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం పెద్దచెరువులో మట్టి సేకరించి చదురుగుడికి మే 21న మంగళవారం ఉదయం 6.30 గంటలకు చేరుకుంటారన్నారు. నాటి నుంచి అమ్మవారు ఉయ్యాలకంబాల మహోత్సవం వరకూ చదురుగుడిలో అమ్మవారు కొలువై ఉంటారన్నారు. సమావేశంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, శ్రీనివాసరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మీ ఓటు... మీ భవిష్యత్తు


కోట కూడలిలో నృత్యాలతో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న గిరిజన వర్సిటీ విద్యార్థులు

- అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్
- ఆకట్టుకున్న ఫ్లాష్ మాబ్

విజయనగరం అర్బన్: మీరు వేసే ప్రతిఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోట, బాలాజీ, మయూరి కూడళ్లలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించి ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన కల్పించారు. హుషారైన నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకొని శతశాతం ఓటింగ్‌ను నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ డీన్ జేపీ మిశ్రా, ఏఓ డాక్టర్ ఎన్.వి. సూర్యనారాయణ, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రారవే రచయితకు చెన్నమనేని పురస్కారం

రాజాం సిటీ: రాజాం రచయితల వేదిక (రారవే) నిర్వాహకుడు, రచయిత గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' అనే పుస్తకానికి చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం వరించింది. ఇటీవల తెలంగాణలోని వరంగల్లుకు చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ నిర్వహించిన పోటీలో పుస్తకానికి పురస్కారం లభించిందని ఆయన గురువారం తెలిపారు. పురస్కారాన్ని మే 12న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా హైదరాబాద్‌లో అందజేస్తారని చెప్పారు. ఆయనను స్థానిక రచయితలు, పట్టణ పెద్దలు అభినందించారు.

కంట్రోల్ రూమ్ సందర్శన


కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదుల జాబితాను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్

విజయనగరం అర్బన్: జిల్లాలోని చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ ఎన్నికల కంట్రోల్ రూమ్, మీడియా కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వాహనాల జీపీఎస్, చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల లైవ్ కార్యక్రమాలను, మీడియా మానిటరింగ్, ఎంసీసీ, సీ విజిల్, 24/7 ఫిర్యాదులు విభాగం, సోషల్ మీడియా పర్యవేక్షణ, రిపోర్ట్స్ విభాగాలను తనిఖీ చేశారు. అన్ని విభాగాల నుంచి చేస్తున్న కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియా సెంటర్‌ను సందర్శించారు. ఎంసీఎంసీ ద్వారా జారీచేస్తున్న అనుమతులపై ఆరా తీశారు. పెయిడ్ న్యూస్, ప్రకటనలను అభ్యర్థుల ఖాతాల్లో వేయాలని సూచించారు. పరిశీలకుని వెంట డీఆర్వో అనిత, సీపీఓ బాలాజీ, డీపీఆర్ఓ రమేష్, కంట్రోల్ రూమ్ అధికారులు పాల్గొన్నారు.

మే 1న బొబ్బిలికి సీఎం జగన్

- ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి


నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావునాయుడు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మే 1న ఉదయం 9.30 గంటలకు బొబ్బిలిలో పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గురువారం తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావునాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు) తదితరులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం పర్యటన 29న ఉందని అధిష్ఠానం నుంచి సమాచారం వచ్చిందన్నారు. సభాస్థలి విషయమై పార్టీ నాయకులతో చర్చించి ప్రదేశాన్ని నిర్ధారిస్తామని చెప్పారు. ఈ విషయమై పట్టణంలోని గ్రోత్ సెంటర్ తదితర ప్రాంతాలను ఎంపిక చేద్దామనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

నేడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

బొబ్బిలి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశానికి నాలుగు మండలాలు, మున్సిపాలిటీలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో ఉన్న చైర్మన్లు, డైరెక్టర్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్యనాయకులు, సీనియర్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి

- జిల్లా మలేరియా అధికారిణి మణి


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక అంబటి సత్రం జంక్షన్ వద్ద నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఒకసారి డ్రైడే పాటించడం ద్వారా దోమల పుట్టుకని అరికట్టవచ్చునని తెలిపారు. ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం వల్ల ప్లాస్మోడియం అనే పరాన్న జీవులు మనిషి రక్తంలోకి ప్రవేశించడం ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందని చెప్పారు. చిన్న పిల్లలు ఎక్కువగా మలేరియా బారిన పడుతుంటారని, సకాలంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమని చెప్పారు. దోమ తెరలు వాడటం మంచిదన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ శిరీష, సబ్ యూనిట్ అర్బన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

జ్వర పీడితులకు మలేరియా పరీక్ష

విజయనగరం ఫోర్ట్: జ్వరం వచ్చిన వ్యక్తులకు రక్త నమూనా తీసి మలేరియా నిర్ధారణ పరీక్ష చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యక్తిగత ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. దోమల నివారణకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులు ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు. పొదుపు సంఘాల మహిళలకు దోమల నివారణ పద్ధతులు గురించి వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టీకా అధికారి డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సాంబశివరావు, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.